క్లుప్తంగా

ఇళ్ల లబ్ధిదారులకు సకల సౌకర్యాలు



వల్సంపేటలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, జేఈ జోగారావు

నాతవరం: ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. మండలంలో వల్సంపేట, నాతవరం జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం స్వయంగా పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకుంటామంటే ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. మండలానికి కొత్తగా 450 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హౌసింగ్ జేఈ జోగారావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో పశువులకు వైద్యం

మాడుగుల: స్థానిక కర్రివారి కళ్లాల వద్ద వైఎస్సార్ పశు సంచార వైద్యంలో భాగంగా 25 పశువులకు వైద్యం అందించారు. 10 చూడి పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే 45 పశువుల పేడ, రక్త నమూనాలు సేకరించారు. దీంతో రైతులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వి. చిట్టినాయుడు, సంచార అంబులెన్స్ పశువైద్యాధికారి శైలేంద్ర, వెటర్నరీ అసిస్టెంట్ కిశోర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, ల్యాబ్ టెక్నీషియన్, కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

బోయిలకింతాడలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బూరె బాబురావు

దేవరాపల్లి: బోయిలకింతాడలో మెరుగైన పారిశుధ్యానికి ప్రణాళికలు రూపొందించామని స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు అన్నారు. గ్రామంలో శుక్రవారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, సచివాలయ సిబ్బంది సహకారంతో ప్రతి వీధిలో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు.

పశువులకు టీకాలివ్వాలి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందేలా చూడాలని పశు వైద్య సిబ్బందికి ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని అప్పలరాజుపురంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులు వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం వాటికి టీకాలు ఇప్పిస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎ.రాజేంద్రప్రసాద్, శ్రీలలితాదేవి వృద్ధాశ్రమం నిర్వాహకురాలు యాల్ల వెంకటలక్ష్మి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యలమంచిలి : మండలంలోని పేట బయ్యవరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యలమంచిలి ప్రభుత్వాస్పత్రి వైద్య బృందం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజావాణి మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆరోగ్యాన్ని సంరక్షించుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.అరుణ్ ప్రకాష్, పి.అభినయ్, కె.ప్రసాద్, ఉపాధ్యాయులు ఎ.పాపారావు, హరి బాబు, బి.సత్యనారాయణ, పి.రవీంద్ర, వి.కృష్ణవేణి, తస్లీమ్ పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు బ్రహ్మరథం

దేవరాపల్లి: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ అన్నారు. దేవరాపల్లిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలనకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నారన్నారు. మండలంలోని 20 సచివాలయాలకు గాను 15 సచివాలయాల్లో మెగా పీపుల్స్ సర్వే శత శాతం, మిగిలిన 5 సచివాలయాల్లో 90 శాతం మేర పూర్తయిందన్నారు. రెండు రోజుల్లో 20 సచివాలయాల్లో శత శాతం పూర్తి చేస్తామన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటా పర్యటించారు. ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. సచివాలయ కన్వీనర్లు గుల్లేపల్లి మురళీకృష్ణ, గొర్రుపోటు రమాదేవి, ఆతవ మహేష్, గాలి వెంకునాయుడు, బంధం అప్పలరాజు, సోమిరెడ్డి పేరునాయుడు, అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.
జగనన్నే మా భవిష్యత్తుకు బ్రహ్మరథం

పలు గ్రామాల్లో..

మాడుగుల రూరల్: ముకుందపురంలో సర్పంచ్ కర్రి గణేశ్ సారథ్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. రాంబుడ్డి ఫణీంద్ర, కర్రి నాయుడుబాబు, కన్నంనాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి స్టికర్లు అంటించారు. అలాగే వంటర్లపాలెంలో సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు సారథ్యంలో ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, సచివాలయ కన్వీనర్ గంగుపాం కనకారావు, ఉప సర్పంచ్ వెంకటరమణ, నాయకులు కాటిపాం గోవిందరావు, రాంబాబు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో మహిళకు బ్రోచర్ అందిస్తున్న కేవీ రమణ

ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్

కె.కోటపాడు : ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధితో సీఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని దాలివలస మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు అన్నారు. గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి జగన్ పాలనలో జరిగిన మేలును వివరించి ఇంటికి, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్ అంటించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌కే పట్టం కడతాం

బుచ్చెయ్యపేట : మాకు మేలు చేసిన ప్రభుత్వానికి మరలా పట్టం కడతామని ప్రజలు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో తెలిపారు. శుక్రవారం బుచ్చెయ్యపేట మండలం ఆర్. భీమవరం, వడ్డాది, బుచ్చెయ్యపేట, పీడీ పాలెం, కరక తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వడ్డాది టౌన్ వైసీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో తామెంతో లబ్ధి పొందామని.. మళ్లీ సీఎంగా జగన్‌నే ఎన్నుకుంటామని తెలపడంతో నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. అమ్మునాయుడు, సేనాపతి నాయుడు, రామారావు, సుంకరి గాంధీ, సోమేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్. భీమవరంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



కన్నంపాలెంలో మహిళతో మాట్లాడుతున్న విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అర్హతే కొలమానంగా అందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పట్టణంలో సచివాలయం–5 పరిధిలో అన్నవరం, పెదబజార్, లక్ష్మీదేవిపేట వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల మంజూరుపై ఆరా తీశారు. సచివాలయం, వలంటీర్ల పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ధర్మశ్రీ చెప్పారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ధర్మశ్రీ సమీక్ష నిర్వహించారు. పూర్తిస్థాయిలో సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, పంచాయతీ డీఈఈ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, ఎంపీటీసీ గూనూరు కరుణకుమారి, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, వార్డు మెంబరు గూనూరు రాజు పాల్గొన్నారు.

మురుగు సమస్య లేకుండా చర్యలు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఈవో, నాయకులు

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల వద్ద మురుగు సమస్య లేకుండా చేస్తామని ఈవో లోవరాజు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తెలిపారు. పాఠశాల నుండి ఈబీసీ కాలనీ మీదుగా డ్రైనేజీ నిర్మాణం పట్ల స్థానిక మహిళలు గురువారం అభ్యంతరం తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఓపెన్ డ్రైనేజీ నిర్మాణం వల్ల ఈగలు, దోమల బెడద ఉంటుందని వారు ఆందోళన చేపట్టారు. దీనిపై శుక్రవారం ఈవో, వైస్ ఎంపీపీ, స్థానిక నేతలు కలిసి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. కస్తూరిబా గాంధీ పాఠశాలకు రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణం చేస్తామన్నారు. విద్యార్థుల వాడుక నీరు తప్ప మురుగు సమస్య లేకుండా చేస్తామని మహిళలకు హామీ ఇచ్చి దగ్గరుండి కాలువ నిర్మాణ పనులు చేయించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దే వైద్యసేవలు



హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి నిర్మల

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతాయని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిర్మల అన్నారు. పైడంపేట గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 97 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఆరుగురికి ఇంటికి వెళ్లి నిర్మల వైద్యం అందించారు. హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, సీహెచ్‌వో సింహాచలం, ఏఎన్ఎం సత్యవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి

కొండపాలెంలో..

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు ధనలక్ష్మి శుక్రవారం కొండపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి చిన్నారులతో పాటు బాలింతలు, గర్భిణులకు వైద్యం అందించారు. పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ఇళ్లకు వెళ్లి పలువురిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

అడ్డసరంలో పశువిజ్ఞాన బడి



పాలదిగుబడి, పునరుత్పత్తిపై వివరిస్తున్న పశు వైద్యుడు నూకేశ్వర్రావు

రోలుగుంట: స్థానిక పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డసరం పాడిరైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి నూకేశ్వర్రావు పాల దిగుబడి, పునరుత్పత్తి క్రమబద్ధీకరణలో పశుగ్రాసం ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. పాడి రైతులు పశు అవసరాలకు తగ్గట్టుగా తగిన పచ్చగడ్డి, ఎండుగడ్డి, సమీకృత దానాలు అందించినట్లయితే పోషణ ఖర్చు తగ్గడంతో పాటు, రైతులకు మరింత లాభం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నానాజి, పాడి రైతులు పాల్గొన్నారు.

పోతురాజు గుడిని ధ్వంసం చేసిన ఉన్మాది



గుడిలో దీపపు దిమ్మను తవ్వేసిన దృశ్యం

చోడవరం రూరల్: జన్నవరం కొత్తూరు గ్రామ రెవెన్యూ అధికారి సియ్యాద్రి సన్యాశినాయుడు తమ గ్రామ శివారులో ఉన్న పోతురాజుబాబుగుడిని ఎవరో ధ్వంసం చేసారని చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేసుకుని సీఐ గ్రామానికి వెళ్లి విచారించారు. బుచ్చియ్యపేట మండలం కందిపూడి గ్రామానికి చెందిన కొప్పాక గణపతిరావు అనే వ్యక్తి గుడి పైన ఉన్న శిఖర నిర్మాణాన్ని, గుడిలో దీపాలు వెలిగించుకోడానికి నిర్మించిన దీపపు దిమ్మలను ధ్వంసం చేసినట్టు తేలిందన్నారు. అయితే నిందితుడు గణపతిరావు మతిస్థిమితం కోల్పోయాడని, ఉన్మాదంలో ఈ దారుణానికి పాల్పడ్డాడని, ఎటువంటి దురుద్దేశ్యం లేదని జన్నవరం సర్పంచ్, ఉప సర్పంచ్, ఇతర మధ్యవర్తులు స్పష్టం చేశారని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

పెద్దచెరువును పరిశీలించిన ఆర్డీవో



చెరువు వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం:వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించే నర్సీపట్నం పెద్ద చెరువును ఆర్డీవో హెచ్.వి.జయరాం ఇరిగేషన్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. చెరువు గర్భంలో నాలుగు ఎకరాల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాల్సి ఉందని పబ్లిక్ హెల్త్ డీఈ మహేష్ ఆర్డీవోకు వివరించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌తో పాటు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించటం వల్ల ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఇరిగేషన్ అధికారులు ఆర్డీవోకు వివరించారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించనున్న జోగునాథునిపాలెం వద్ద ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. రూ.166.86 కోట్లతో చేపట్టిన భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో ముందుకువెళ్ళాలని ఆర్డీవో సూచించారు. చెరువు, ప్రభుత్వ స్థలానికి సంబంధించి సమగ్ర నివేదిక తయారు చేయాలని తహసీల్దార్ అన్నాజీరావు, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ప్రభుత్వానిదని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీవీ అగ్రహారం సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు గోవిందరావు, తూర్పుకాపు సంఘ అధ్యక్షుడు గొంతిన హరిబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాశపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తాటిచెట్టు కూలడంతో ధ్వంసమైన షెడ్డు

మాకవరపాలెం: తాటిచెట్టు కూలిన ఘటనలో భారీ ప్రమాదం తప్పింది. మండలంలోని తామరం వేంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో నర్సీపట్నం–విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న తాటిచెట్టు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో రోడ్డుకు మరోవైపు ఉన్న రేకుల షెడ్డుపై చెట్టు పడటంతో షెడ్డు ధ్వంసమయింది. ఈ నేపథ్యంలో సిమెంట్ తూరలు నిర్మించి జీవనం సాగిస్తున్న పంచదార్ల గోవిందకు నష్టం వాటిల్లింది. రోడ్డుకు అడ్డంగా ఈ చెట్టు కూలిపోవడంతో సుమారు అరగంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టు కూలిన సమయంలో వాహనదారులు ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



జగనన్న కాలనీలో డీఎల్‌డీవో మంజులవాణి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులవాణి సూచించారు. శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని గంటవానిపాలెం జగనన్న కాలనీని ఆమె సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇళ్ల పట్టాతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమయ్యే ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందన్నారు. కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఆరిగా శ్రీను, కోన అప్పలరాజు, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సభ్యుల మజ్జిగ పంపిణీ



రైతుబజార్ వద్ద మజ్జిగ, శీతలపానీయం పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

చోడవరం రూరల్: సేవా కార్యక్రమంలో భాగంగా చోడవరం వాసవీ క్లబ్ సభ్యులు శుక్రవారం మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ చేశారు. వాసవీ కిరాణా వర్తక సంఘం, వాసవీ యువత సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఉదయం ప్రారంభించిన మజ్జిగ ఉచిత పంపిణీ కార్యక్రమం మండుటెండలోనూ సాగింది. రైతు బజార్‌కు వచ్చిపోయే వారందరికీ చల్లని మజ్జిగ, శీతల పానీయాన్ని అందచేసి సేదతీర్చారు. వర్తక సంఘం అధ్యక్షుడు పి.వెంకట్ వాసు, యూత్‌క్లబ్ అధ్యక్షుడు కె.మణికుమార్, కార్యదర్శి కె.రామకృష్ణ, కోశాధికారి పి.కిరణ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

నాతవరం: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకుని, నిబంధనల ప్రకారం సంఘాలు నడిపించుకుంటే మహిళలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని వెలుగు లీగల్ కంప్లైంట్ ఏరియా కోఆర్డినేటర్ రుత్తల శ్రీను అన్నారు. మండల కేంద్రంలో వీవోలు, డ్వాక్రా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ ఆసరా మూడు విడతల కింద నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించి 5,227 గ్రూపులకు చెందిన 55,978 మంది మహిళలకు సుమారు రూ. 120 కోట్లు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మహిళలకు తెలియజేసి అర్హులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు వాసు, లక్ష్మి, సంతోష్, శ్రీదేవి, మణిరాజ్, రమణ, గణేష్, కార్యాలయ అకౌంటెంట్ సునీత, వీవోలు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

నాతవరం: గ్రామాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలకు ఇకపై తప్పనిసరిగా పంచాయతీ తీర్మానం, కలెక్టరు అనుమతి ఉండాలని ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. గునుపూడి, ఎ.శరభవరం, మర్రిపాలెం, జిల్లేడుపూడి, చెర్లోపాలెం, నాతవరం, వైబీపట్నం, గుమ్మడిగొండ, వెదురుపల్లి, ములగపూడి తదితర గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటు సమయంలో పార్టీల కార్యకర్తల మధ్య తగాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

కె.కోటపాడు : వేసవిలో గ్రామ కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని పంచాయతీ కార్యదర్శి ఎన్.రామునాయుడు అన్నారు. చౌడువాడ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రయాణాలు చేసే వారికి, ప్రజలకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని రామునాయుడు తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మూడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

మాకవరపాలెం: మండలంలోని మూడు సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. గిడుతూరు, రాచపల్లి, బూరుగుపాలెంలో నిత్యం ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మరికొన్ని గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

గిరిజనుల వినూత్న నిరసన

రావికమతం: తమకు బకాయిపడిన రేషన్ బియ్యాన్ని తక్షణం ఇప్పించాలని, జీసీసీ డిపో సేల్స్‌మేన్‌కు వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చీమలపాడు శివారు రొచ్చుపణుకు, అజేయపురం గ్రామాలకు చెందిన గిరిజనులు శుక్రవారం నోటిలో ఆకులు పెట్టుకుని ఖాళీ కంచాలు చేతపట్టుకుని నిరసన తెలిపారు. కళ్యానపులోవ జీసీసీ సేల్స్‌మేన్ నిర్వాకం వలన తమకు రేషన్ సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. ఈ నెల 15, 17 తేదీల్లో పలు గ్రామాల గిరిజనులు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు సక్రమంగా విచారణ చేయలేదని తమకు మూడు నెలల రేషన్ బకాయి ఉండగా ఒక్క నెల మాత్రమే ఉందని విచారణలో తేల్చి తమకు అన్యాయం చేస్తున్నారని గిరిజనులు ఆరోపించారు. గిరిజన నాయకుడు ఉల్లి రాజబాబు, సోమరాజు, టీకు రవి, నల్లా రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు 30

మాడుగుల: పీఎం కిసాన్ 14వ విడత నిధులు రైతుల ఖాతాలకు జమ కావాలంటే ఈ నెల 30లోపు ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు మండలంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు 13,520 మంది కాగా ఇంత వరకు 11,920 మంది ఈకేవైసీ చేయించుకున్నారని, ఇంకా 1600 మంది ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోలేని రైతులు దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రాలు, ఆర్‌బీకే కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వీవీ అగ్రహారంలో చలివేంద్రం ప్రారంభం

మాడుగుల రూరల్: మండలంలో వీవీ అగ్రహారం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్ చలివేంద్రం ప్రారంభించారు. ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణమ్మా, వెలగాడ ఈశ్వరావు, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, మాజీ ఉప సర్పంచ్ దాడి రాజేశ్వరావు, సయ్యపురెడ్డి హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి కోరుకొండ జగదీశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అవురువాడ గ్రామంలో ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు చదల కృష్ణందొర, మాజీ సర్పంచ్ కోటి, పార్టీ నాయకుడు బన్నీ సారథ్యంలో కార్యక్రమం నిర్వహించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మృతి చెందిన దట్టి నూకరాజు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోటపాడు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ దట్టి నూకరాజు (50) శుక్రవారం మృతి చెందారు. గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన నూకరాజు చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆయన భార్య వరలక్ష్మి మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో నూకరాజు చనిపోయారు. ఈయన గుండెపోటు వల్ల మృతి చెందారని వైద్యులు తెలిపారు. గతంలో ఒకసారి నూకరాజుకు గుండెపోటు వచ్చిందని భార్య వరలక్ష్మి తెలిపారు. మృతుడి భార్య వరలక్ష్మిని స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీడీవో మీనాకుమారి, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో ఎన్. వరహాలు, స్థానిక వీఆర్‌పీ మట్టా రాము పరామర్శించారు. మృతునికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఏపీవో వరహాలు తెలిపారు.

పోషకాహారంతో మహిళల ఆరోగ్యం

మునగపాక : మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు సూచించారు. మండలంలోని గణపర్తిలో శుక్రవారం విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ట్రస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయి చరణ్ పోషకాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థుల ఆట పాటలు, మాటల ద్వారా అవగాహన కల్పించారు. ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పీఎంసీ చైర్మన్ శరగడం చిన్న, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.